# నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం: నిమ్మల



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 14:** శ్రీశైలం జలాల వినియోగం లో నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ వ్యవహరిస్తోం దని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకా లు జరగాలని ఆయన పేర్కొన్నారు.రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారానికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశాలు కీలకమని మంత్రి తెలిపారు. నీటి పంపకాల విషయ ంలో ఏపీకి ఉన్న అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. రెండు రాష్ట్రాలు ఆయా బోర్డుల నిబంధనల ప్రకారమే పరస్పరం వ్యవహరించాలని సూచించారు. గోదావరి--కావేరి అనుసంధానంపై..గోదావరి--కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపైనా నిమ్మల రామానాయుడు స్పందిం చారు. ప్రాజెక్టు అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని ఆయన కోరారు.

# అసెంబ్లీ వర్షాకాల సమావేశాల భద్రతపై కో-ఆర్డినేషన్ సమావేశం

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 14:** ఈనెల17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై కో-ఆర్డినేషన్ సమావేశమైంది. శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఐపీఎస్ అధికా రులు, అసెంబ్లీ ఉన్నతాధికారులతో చర్చించారు. వర్షాకాల సమావేశాల సందర్భంగా అసెంబ్లీ పరిసరాల్లో భద్రత, బందో బస్తు, సమన్వయంపై కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణంరాజు, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ ఎన్.మధుసూదన్ రెడ్డి, గుంటూ రు ఎస్పీ వకుల్ జిందాల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ హాజరయ్యారు.

# విజయవాడలో మూడు రోజుల పాటు కనువిందు చేయనున్న స్వాతంత్ర్య శకటాలు!

**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 14 :** విజయవాడ నగరానికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందడి మరింత ప్రత్యేకతను సంతరించుకోనుంది. అమరావతిలో ఆగస్టు 15న నిర్వహిం చనున్న స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అలంకృత శకటాలు.. పరేడ్ అనంతరం విజయవాడకు చేరుకుని నగరవా సులు, పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు నగరంలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో ఈ శకటాల ప్రదర్శన కొనసాగ నుంది.స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం ఒకరోజు వేడుకగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిం చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అమరావ తి లోని నేలపాడు గ్రౌండ్‌లో జరిగే ఇండిపెండెన్స్ డే పరేడ్‌లో వివిధ ప్రభుత్వ శాఖలు తమ ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలను ప్రదర్శించనున్నాయి. పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ శకటాలను అనంతరం విజయవాడ ప్రజలకు దగ్గరగా తీసుకురానున్నా రు. నగరంలోని ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా మూడు ప్రాంతాలను అధికారులు ఎంపిక చేశారు. కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ రథం సెంటర్ ఎదురుగా ఉన్న కెనాల్ రోడ్ పార్కింగ్ ప్రదేశంలో ఒక ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మృతి వనం ఎదురుగా మహాత్మా గాంధీ రోడ్డులో మరో ప్రదేశంలో శకటాలను ఉంచనున్నారు. లెమన్ ట్రీ హోటల్ నుంచి స్టేట్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వరకు ఉన్న ప్రాంతంలో కూడా శకటాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. విభిన్న ప్రభుత్వ శాఖల పనితీరును, రాష్ట్ర అభివృద్ధి ప్రయాణాన్ని, ప్రజా సంక్షేమాన్ని, ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ శకటాలు నగరవాసులకు ప్రత్యేక అనుభూతిని అందించను న్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు రాష్ట్ర ప్రగతి, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా ఈ ప్రదర్శన ఉపయోగప డనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కుటుంబాలతో కలిసి నగరంలోని ప్రజలు ఈ శకటాలను వీక్షించే అవకాశం ఉంది. మూడు రోజుల పాటు ప్రదర్శన కొనసాగనున్నందున వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు కూడా వీటిని చూసే వీలు కలగనుంది. ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు యువత, విద్యార్థులు ఆసక్తి చూపే అవకాశం ఉండటంతో ప్రదర్శన ప్రాంతాల్లో రద్దీని నియంత్రించేం దుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.శకటాల ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శకటాల వద్ద భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు సందర్శకు ల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూనే.. రాష్ట్ర ప్రగతి, సంస్కృతి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల ముందుంచే వేదికగా ఈ అలంకృత శకటాల ప్రదర్శన నిలవనుంది. ఆగస్టు 15 నుంచి 17 వరకు విజయవాడలో జరిగే ఈ ప్రత్యేక ప్రదర్శనను నగరవాసులు, విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో సందర్శించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ బి. శ్రీనివాసరావు కోరారు.

# ఆన్‌లైన్‌లో తిరుమల శ్రీవారి సేవలు బుక్ చేస్తున్నారా?..



**తిరుపతి, ఆగస్టు 14 :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్‌ల పేరుతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుక్రవారం ఒక ప్రకటనలో గట్టిగా హెచ్చరించింది. టీటీడీ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా పేజీలను సృష్టించి కొందరు మోసగాళ్లు భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్నారని, ఇటువంటి మోసాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేసింది.

**మోసాల స్వరూపం ఇదీ..**

కొందరు కేటుగాళ్లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన విధంగా నకిలీ వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు. టీటీడీ లోగో, శ్రీవారి చిత్రాలను వాడుతూ భక్తులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సులభంగా శ్రీవారి దర్శనం, కల్యాణోత్సవం వంటి ఆర్జిత సేవలు, తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా పేజీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఈ ప్రచారాన్ని నమ్మిన అమాయక భక్తులు, వారిని సంప్రదించిన పుడు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత, వారు నకిలీ బుకింగ్ పత్రాలను పంప డం లేదా పూర్తిగా అదృశ్యం కావడం వంటివి చేస్తున్నారు. తీరా తిరుమల వచ్చిన తర్వాత తాము మోసపోయామని గ్రహించిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తరహా ఫిర్యాదులు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఇటీవలి కాలంలో అధికంగా అందుతున్నాయి.

**ఉక్కుపాదం మోపుతున్న టీటీడీ**

ఈ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. టీటీడీ ఐటీ విభాగం, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం, సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. టీటీడీ పేరు, లోగో, ట్రేడ్‌మార్క్‌లను దుర్వినియోగం చేస్తున్న నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

గత రెండేళ్లలో ఇటువంటి 259 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి, వాటిని బ్లాక్ చేయించినట్లు టీటీడీ తెలిపింది. అంతేకాకుండా, ఈ వెబ్‌సైట్ల నిర్వాహకులపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్తులో కూడా టీటీడీ మేధో సంపత్తి హక్కులను (Intellectual Property Rights) ఉల్లంఘించే వ్యక్తులు, సంస్థలపై కాపీరైట్, ట్రేడ్‌మార్క్ చట్టాల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

**భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలు**

ఆన్‌లైన్ మోసగాళ్ల వలలో చిక్కకుండా ఉండేందుకు భక్తులు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ సూచించింది.

శ్రీవారి దర్శనం, సేవలు, వసతి గదుల బుకింగ్‌ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా టీటీడీ అధికారిక మొబైల్ యాప్‌ను మాత్రమే ఉపయోగించాలి.

వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనధికారిక బుకింగ్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. వాటిని క్లిక్ చేయవద్దు. పరిచయం లేని వ్యక్తులు ఫోన్ చేసి దర్శనం లేదా సేవలు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దు. వారికి ఎలాంటి డబ్బులు పంపవద్దు. ఏదైనా వెబ్‌సైట్ లేదా సోషల్ మీడియా ఖాతా టీటీడీ పేరుతో ఉన్నప్పటికీ, అది అధికారికమైనదో కాదో నిర్ధారించుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలి. అనుమానాస్పద వెబ్‌సైట్లు లేదా సందేశాలు కనిపిస్తే వెంటనే టీటీడీ కాల్ సెంటర్ లేదా సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆనందంగా దర్శనం చేసుకుని వెళ్లాలన్నదే టీటీడీ ఉద్దేశమని, ఆన్‌లైన్ మోసగాళ్ల కారణంగా భక్తులు ఇబ్బందులు పడకూడదని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులందరూ అప్రమత్తంగా ఉండి, దేవస్థానానికి సహకరించాలని కోరారు.

# దమ్ముంటే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి: యరపతినేని



**గుంటూరు, ఆగస్టు 14 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాల పేరుతో వైసీపీ నేతలు డ్రామాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్లు డీఎస్సీ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఒక్క ఉద్యోగం కూడా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. శు క్రవారం గుంటూరు జిల్లా వేదికగా యరపతినేని మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని సవాల్ చేశారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని పేర్కొన్నారు.

**మంచిని చెడుగా చూపడం వైసీపీ నైజం..**

మంచిని చెడుగా చూపడం వైసీపీ నైజంగా కనిపిస్తోందని యరపతినేని విమర్శించారు. డీఎస్సీ విజేతలు స్వయంగా వచ్చి అంతా సజావుగా జరిగిందని ప్రభుత్వానికి చెప్పారని ప్రస్తావించారు. ఏపీలో జరిగే ప్రతి అభివృద్ధిపై వైసీపీ విషం చిమ్ముతోందని ఆగ్రహించారు. వైసీపీ వంటి రాజకీయ పార్టీ ఉండటం ఏపీకి దురదృష్టమని చెప్పారు. వై నాట్ 175 నుంచి 11 సీట్లు వచ్చినా వారిలో మంచి ఆలోచనలు రావటం లేదని విమర్శించారు. వైసీపీ నేతల మానసిక పరిస్థితిపై అనుమానాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు.

**పరామర్శల పేరుతో వ్యవస్థలు ధ్వంసం..**

రోజూ ఎక్కడ శవం దొరుకుతుందా అని వారు ఎదురు చూస్తున్నారని యరపతినేని సెటైర్లు గుప్పించారు. పరామర్శల పేరుతో వైసీపీ నేతలు వ్యవస్థలను ధ్వంసం చేసి, ప్రజలను పోలీసులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రప్పా రప్పా అని నరికి 11కు వచ్చారని.. ఇంకా ఏం నరుకుతారని ప్రశ్నించారు.

**రప్పా రప్పా అని ఫ్లెక్సీలు ఎందుకు..**

రప్పా రప్పా అని ఫ్లెక్సీలు ఎందుకని యరపతినేని శ్రీనివాసరావు నిలదీశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ , లోకేశ్‌లను ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. దళిత మహిళా హోం మంత్రిగా ఉంటే అవమానరుస్తారా..? అని ఫైర్ అయ్యారు. రాజకీయాల్లో కూడా ఓ లిమిట్ ఉంటుందని తెలిపారు. లిమిట్ దాటితే తాము చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. వైసీపీ హయాంలో హత్యా రాజకీయాలను పెంచి పోషించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అలాంటి వాటికి దూరంగా ఉందని స్పష్టం చేశారు.

**వైసీపీ కాలగర్భంలో కలిసి పోతుంది..**మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శిస్తా అనే పేరుతో జగన్ ఐదు గంటల పాటు ప్రదర్శన చేశారని యరపతినేని విమర్శించారు. విరూపాక్షను అరెస్టు చేయొద్దని.. నోటీసులు ఇవ్వాలని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మరి నంద్యాలలో చంద్రబాబుకు నోటీసు ఇవ్వకుండా ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. ఇంత వింత పోకడ పోయినోళ్లు వ్యవస్థలో మనుగడ లేకుండా పోయారని విమర్శించారు. వైసీపీ కూడా కాలగర్భంలో కలిసి పోతుందని యరపతినేని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు.

# మైనారిటీల బుజ్జగింపే కాంగ్రెస్ లక్ష్యమా?

- సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం
- ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న ప్రభుత్వం
- హైడ్రా చర్యలపై ప్రశ్నల వర్షం
- ఓటు బ్యాంకు రాజకీయాల ఆరోపణ

**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 14 :** పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రత్యేక వర్గాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన ఆయన, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం వ్యాఖ్యానించినట్లు పేర్కొంటూ రాంచందర్ రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం చట్టాలు, నిబంధనలను అందరికీ ఒకే విధంగా అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉందని, కొందరికి ఒకలా మరికొందరికి మరోలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.రాష్ట్రంలో హైడ్రా చర్యల పేరుతో పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్న సందర్భాల్లో ప్రభుత్వం ఎలాంటి సానుభూతి చూపడం లేదని ఆయన ఆరోపించారు. నిబంధనల ఉల్లంఘన పేరుతో చర్యలు తీసుకుం టున్న ప్రభుత్వం, విద్యుత్ బిల్లులు చెల్లించని వారిపై మాత్రం సానుకూల వైఖరి అవలంబించడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఒకవైపు సామాన్య ప్రజలపై కఠిన చర్యలు తీసుకుంటూ, మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించేలా మాట్లాడటం కాంగ్రెస్ రాజకీయ స్వభావాన్ని ప్రతిబింబిస్తోందని రాంచందర్ రావు అన్నారు. ప్రజల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు.హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని ఆయన విమర్శించారు. గతం నుంచి ఇప్పటి వరకు అదే రాజకీయ విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సమాజంలో విభజనలను ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు లో మతం, వర్గం అనే తేడాలు లేకుండా వ్యవహరించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించే విధంగా పాలన సాగించాలని సూచించారు.

# విదేశాల్లో భారతీయులపై 7 రెట్లు పెరిగిన దాడులు

విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లల్లో 7 రెట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయులపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది.భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యూఎస్, యూఏఈ, యూకే, కెనడాల్లో వెలుగుచూశాయి. మొత్తం 36 దేశాల గణాంకాలను విదేశాంగ శాఖ రాజ్యసభ ముందుంచింది. అమెరికాలో గత ఐదేళ్లల్లో భారతీయులకు సంబంధించి 33 కేసులు వెలుగు చూశాయి. యూఏఈలో 32 కేసులు, యూకేలో 31, కెనడాలో 30 కేసులు వెలుగు చూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లల్లో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి.భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలలో ఏటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యూఎస్ఏలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లో ఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యూకేలో 2021లో ఒక దాడి ఘటన వెలుగు చూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో పదకొండు, 2024లో పది, 2025లో ఐదు వెలుగు చూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగు చూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025 ఏకంగా 11 కేసులు వెలుగు చూశాయి.విదేశాల్లో భారతీయుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. భారతీయ ఎంబసీలు, సిబ్బంది అక్కడి భారతీయుల విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

# రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

వీరందరికీ స్మార్ట్ కార్డులు అందజేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ సదస్సు తరహాలో ఈ ఏడాది 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సదస్సును 'ఇన్వెస్ట్ తెలంగాణ' అంశంతో నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళిక ఆవిష్కరణతో పాటు రక్షణ, అంతరిక్ష, ఔషధ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రత్యేక ప్రదర్శనలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.వ్యవసాయ రంగానికి సంబంధించి వానాకాలంలో ఏడు రకాల సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. గ్రామపంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించింది. ఈ ఏడాది నుంచి గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యాలకు మాత్రమే క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. అలాగే యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన మిగులు ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. నైపుణ్యాభివృద్ధి రంగంలో కీలక మార్పులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. అదేవిధంగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 86 పాఠశాలలకు అనుమతులు మంజూరైనట్లు వెల్లడించింది.

హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పెట్రోల్, డీజిల్ ఆటోలను విద్యుత్ ఆటోలుగా మార్చే ప్రత్యేక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల వ్యయంతో అమలయ్యే ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు. పాత ఆటోలకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా కొత్త విద్యుత్ ఆటోలు కొనుగోలు చేసేందుకు ఈ సాయం ఉపయోగపడనుంది. అలాగే నగరంలోని కాలుష్యకారక పరిశ్రమల తరలింపుకు సంబంధించిన హెచ్ఐఎల్టీ విధానం దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించింది. సాగునీరు, విద్యుత్ రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయాన్ని ఆమోదించింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికీ కేబినెట్ అనుమతి మంజూరు చేసింది.

# రాజగోపాల్ వ్యాఖ్యలపై పీసీసీ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 14 :** కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని, ఈ విషయాన్ని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిని సహించబోమని స్పష్టం చేశారు. పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మహేష్ గౌడ్ హెచ్చరించారు. పార్టీ గీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా ఒకటేనని పేర్కొన్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో ఎలాంటి వెనుకంజ ఉండదన్నారు.రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై తీసుకోవాల్సిన చర్యల అంశాన్ని పార్టీ అధిష్టానంతో చర్చిస్తానని తెలిపారు. పార్టీ అంతర్గత వ్యవహారాలను బహిరంగ వేదికలపై చర్చించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం కొన్ని హామీలు ఇచ్చి ఉండవచ్చని మహేష్ గౌడ్ అన్నారు. అయితే పదవులు, మంత్రివర్గ విస్తరణ వంటి అంశాలపై తుది నిర్ణయం పార్టీ హైకమాండ్‌దేనని తెలిపారు.

# మరుగున పడిన చరిత్ర

**రాజధాని వాయిస్:ఆగస్టు 14** గాంధీజీ సహాయ నిరాకరణోద్యమ పిలుపునందుకొని పలనాడులో పుల్లరి ఉద్యమాన్ని నడిపిన వారు పలనాటి బెబ్బులి కన్నెగంటి హనుమంతు. మించాలపాడు గ్రామవాసి అయిన హనుమంతు పలనాటి సీమలోని గ్రామాలలో పర్యటించి బ్రిటిష్ వారు పశుగ్రాసం పై, వంట చెరుకుపై విధించిన పన్నును వ్యతిరేకిస్తూ పుల్లరి ఉద్యమానికి ఆయువు పోశారు. కన్నెగంటి హనుమంతు పిలుపునకు ఆకర్షితులైన పట్లవీడు గ్రామవాసి దారివేముల పేరయ్య పుల్లరి ఉద్యమంలో కన్నెగంటి మార్గంలో నడిచారు. జంతు చర్మాన్ని చెప్పులు గాను, తప్పెట్లుగా తయారు చేసే మాదిగ కుటుంబానికి చెందిన పేరయ్య అడవి పత్తి కట్టెతో ఇళ్లను కప్పడంలోనూ సిద్ధ హస్తులు.యువకులకు తప్పెట్లు కొట్టడం నేర్పించి పదిమంది బృందాన్ని తయారు చేసుకున్నారు. తన జీవన మనుగడకు కావాల్సిన జంతు చర్మాన్ని శుద్ధి చేయుటకు కావాల్సిన తంగేడు చెక్క, ఇళ్లను నిర్మించుటకు అవసరమయ్యే కర్రలు, పత్తి కట్టె మరియు వంట తయారు చేసుకొనుటకు అవసరమయ్యే వంట చెరుకు మరియు అడవి నుండి దొరికే కలపపై పన్ను విధిస్తే తమ జీవనం కష్టమని భావించిన పేరయ్య పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా కన్నెగంటి హనుమంతు వెంట పోరుబాటలో నడిచారు. శిస్తు వసూళ్లకు గ్రామాధికారులు,ఆంగ్ల దొరలు గ్రామంలోనికి రాకుండా ఊరి బయట ముళ్ళ పొదలను నరికి దారిలో వేసి వాటిపై అడవిరాళ్లను నేర్పరితనంగా గుట్టలుగా పేర్చి అధికారులు ఊరిలోకి రాకుండా అడ్డుకోవడం పేరయ్య నేతృత్వంలో జరిగేది. మండలాధికారులు ఊరిలోకి వచ్చినప్పుడు వారికి స్వాగతం చెప్పడానికి పేరయ్య బృందం తప్పెట్లు కొట్టడానికి నిరాకరించే వారు.

కన్నెగంటి హనుమంతుని అనుసరిస్తూ

"వీరుల గడ్డ పలనాడురా
వీర బెబ్బులి హనుమంతురా
పుల్లరి గిల్లరి గోల ఏందిరా
దొర దేశం వీడి పోవేందిరా"

అని పేరయ్య బృందం నినాదించేవారు.

1922 ఫిబ్రవరి మహాశివరాత్రి నాడు మించాలపాడు గ్రామాన్ని చుట్టుముట్టి బ్రిటిష్ బలగాలు కన్నెగంటి హనుమంతును కాల్చి చంపడంతో పుల్లరి ఉద్యమం ముగిసింది. కన్నెగంటి నడిపిన పుల్లరి ఉద్యమంలో పట్లవీడు ప్రాంతంలో ప్రముఖ పాత్ర పోషించిన దారివేముల పేరయ్య కన్నెగంటి మరణంతో పుల్లరి ఉద్యమాన్ని విరమించి స్వాతంత్ర్య ఉద్యమంలో తన వంతు కృషి చేసి 1951వ సంవత్సరంలో పేరయ్య తనువు చాలించారు. పుల్లరి ఉద్యమంలో మౌఖికంగా చెప్పుకునే వీరి పాత్రను సంగ్రహించి మరుగున పడిన స్వాతంత్ర్య సమరయోధుల జాబితాలో చేర్చి, గ్రంథస్తం చేసి ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వాహణాధికారి రేగుమళ్ళ మల్లికార్జున మరియు వారి సిబ్బందికి, భారతీయులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.....

అనిల్ కుమార్ దారివేముల
మాచర్ల, పల్నాడు జిల్లా
9951244718.

# శ్రీ వైష్ణవి విద్యాసంస్థలు ప్రగతి కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**సత్తెనపల్లి.ఆగస్టు 14,రాజధాని వాయిస్:** పట్టణంలోని శ్రీ వైష్ణవి ప్రగతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంగళగిరి సీఐడీ కార్యాలయం నుంచి డీఎస్పీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. విద్యాసంస్థల డైరెక్టర్ దగ్గుబాటి శివబ్రహ్మారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో శ్రీ వైష్ణవి విద్యాసంస్థలపార్ట్నర్స్,ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు, శ్రీనివాసచారి, సుబ్బరాజు, శ్రీనివాసరావులు వేదికనుఅలంకరించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ దగ్గుబాటి శివ బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, పట్టుదలతో లక్ష్యాన్ని చేదించుకొని సాధించాలని సూచించారు. చట్టానికి ధర్మానికి న్యాయానికి మూడు సింహాలు అయితే సమాజంలో కనిపించని ఆ నాలుగో సింహంమే జ్ఞానం,అని అన్నారు బాధ్యత, విలువలు కూడా మనిషి జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు.జ్ఞానం కేవలం మార్కులు,ర్యాంకుల వల్ల మాత్రమే రాదని, విద్య ద్వారానే నిజమైన జ్ఞానంసంపాదించగల మనివిద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

## వమ్మరవల్లిలో ఉత్సాహంగా పాల్గొన్న అచ్చెన్నాయుడు
## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హాజరు
## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం
## కార్యకర్తలు, ప్రజల ఆదరణపై నేతల హర్షం





**రాజధాని వాయిస్ శ్రీకాకుళం, ఆగస్టు 14:** శ్రీకాకుళం జిల్లా గార మండలం వమ్మరవల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా హాజరయ్యారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి వివరించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించి వారి ఆశీస్సులు కోరారు. ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని పార్టీ నాయకులు తెలిపారు. ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందమే తమ పాలనకు నిజమైన గెలుపు అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వారికి అందుబాటులో ఉంటూ సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీకి ఉన్న బలమైన పునాదులు మరోసారి స్పష్టమయ్యాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలు, కార్యకర్తల ఉత్సాహం పార్టీ శ్రేణులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని అన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మరింత అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.

# డీఎస్సీపై చర్చకు సిద్ధమా?

## వైసీపీ ఆరోపణలకు ఎమ్మెల్యే పులివర్తి నాని సవాల్
## మెరిట్ అభ్యర్థుల ఆత్మగౌరవ ర్యాలీకి సంఘీభావం
## ఉపాధ్యాయులను రాజకీయ పావులుగా వాడొద్దని హితవు





**రాజధాని వాయిస్ చంద్రగిరి, ఆగస్టు 14 :** చంద్రగిరిలో నిర్వహించిన మెగా డీఎస్సీ మెరిట్ విద్యార్థుల ఆత్మగౌరవ ర్యాలీకి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి వినీల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే తీవ్రంగా తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులు కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యా యులు, వారి కుటుంబాలను రాజకీయ విమర్శలతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పులివర్తి నాని అన్నారు. చంద్రగిరిలో యువత, డీఎస్సీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఆత్మగౌరవాన్ని చాటుతున్నారని తెలిపారు. తమ ప్రతిభ, కష్టానికి అనుగుణంగానే ఉద్యోగాలు సాధించామని అభ్యర్థులు స్పష్టం చేస్తున్నారని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల కలను సాకారం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ నిష్పక్షపాతంగా నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగ నియామకాల విషయంలో యువతకు నిరాశ ఎదురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిందని అన్నారు. మెగా డీఎస్సీ విషయంలో అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని పులివర్తి నాని సూచించారు. ఉపాధ్యాయ నియామకాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని చర్చ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు.

అభ్యర్థుల ప్రతిభను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరికాదన్నారు.ఉపాధ్యాయులను రాజకీయ పావులుగా ఉపయోగించుకోవద్దని వైసీపీ అధినేత జగన్‌కు పులివర్తి నాని సూచించారు. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులపై రాజకీయ విమర్శలు చేయడం, వారి నియామకాలపై అనవసర అనుమానాలు సృష్టించడం వల్ల అభ్యర్థులు, వారి కుటుంబాలు మానసికంగా ఇబ్బందులు పడతారని అన్నారు. మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను అవమానిస్తే సహించబోమని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీని చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని పులివర్తి నాని విమర్శించారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మరోసారి స్పష్టం చేస్తూ, ఆధారాలతో మాట్లాడేందుకు వైసీపీ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తాము నిరంతరం పోరాడతామని తెలిపారు.

# చికిత్స అనంతరం చిన్నారిని పరామర్శించిన మంత్రి

**ములకలచెరువులో చంద్రికను కలిసిన సత్యకుమార్ యాదవ్**
**వైద్య సేవలపై కుటుంబ సభ్యులతో ఆరా**
**చికిత్స అనంతర ఆరోగ్య పరిస్థితిపై వివరాల సేకరణ**
**చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**





**రాజధాని వాయిస్ ములకలచెరువు, ఆగస్టు 14 :** ఇటీవల వైద్య చికిత్స పొందిన చిన్నారి ఎస్. చంద్రికను రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నమయ్య జిల్లా ములకలచెరువులోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చికిత్స అనంతరం ప్రస్తుతం చిన్నారికి అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారి చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చికిత్స అనంతరం ఆరోగ్యంలో వచ్చిన మార్పులు, వైద్యుల పర్యవేక్షణ, తీసుకుంటున్న జాగ్రత్తల గురించి కుటుంబ సభ్యులతో చర్చించారు. చిన్నారి ఆరోగ్యానికి సంబంధించి అవసరమైన అంశాలపై కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.చిన్నారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, వైద్యుల సూచనలను క్రమం తప్పకుండా పాటించాలని కుటుంబ సభ్యులకు సూచించి నట్లు తెలిపారు. చికిత్స అనంతర దశలో చిన్నారికి అవసరమైన వైద్య సహాయం, ఆరోగ్య పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజారోగ్యానికి ప్రభు త్వం ప్రాధాన్యం ఇస్తోందని, అవసరమైన వారికి వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందిం చడంతో పాటు, చికిత్స అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని కూడా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులకు అవసరమైన సహకారం అందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చంద్రికను పరామర్శిం చిన సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. చిన్నారి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడాలని, సాధారణ జీవనానికి త్వరగా తిరిగి రావాలని కోరుకున్నారు. చిన్నారి ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి ఆరోగ్యం, వైద్య సేవలు, కుటుంబ పరిస్థితికి సంబంధించిన వివరాలను మంత్రి తెలుసుకున్నారు. చిన్నారి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పరామర్శ కార్యక్రమాన్ని ముగించారు.

# స్వాతంత్ర్య వేడుకల వేళ.. విద్యుత్ వెలుగుల్లో సచివాలయం, అసెంబ్లీ!

**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 14:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ముస్తాబైంది. జాతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. రాత్రివేళ విద్యుత్ దీపాల కాంతులతో మెరిసిపోతూ.. దేశభక్తి భావనను చాటుతు న్నాయి. మువ్వన్నెల జాతీయ పతాకం స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు.ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేం దుకు అమరావతిలో ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జాతీయ జెండాలోని మూడు రంగులను ప్రతిబింబించేలా సచివాలయం, అసెంబ్లీ భవనాలను ప్రత్యేకంగా అలంకరించారు. భవనాలపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రాత్రివేళ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.అసెంబ్లీ, సచివాలయానికి వెళ్లే ప్రధాన రహదా రులు, పరిసర ప్రాంతాల్లోనూ ప్రత్యేక విద్యుత్ అలంకరణలు చేపట్టారు. రహదారుల వెంట ఏర్పాటు చేసిన లైటింగ్‌తో రాజధాని ప్రాంతం పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. జాతీయ పతాకం, దేశభక్తి సందేశాలను ప్రతిబింబించేలా రూపొందించిన అలంకరణలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ.. దేశ ఐక్యత, సమగ్రతను చాటేలా ఈ అలంకరణలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. పగటిపూట ప్రభుత్వ కార్యకలాపాలతో సందడిగా కనిపించే సచివాలయం, అసెంబ్లీ ప్రాంతం.. రాత్రివేళ విద్యుత్ కాంతుల్లో మరో రూపాన్ని సంతరించుకుంది.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ప్రజలు, విద్యార్థులు వీక్షించేలా ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీస్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమా లతో పాటు జాతీయ పర్వదినాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.ఇలా.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అమరావతి సిద్ధమవుతుండగా.. మువ్వన్నెల కాంతుల తో మెరిసిపోతున్న సచివాలయం, అసెంబ్లీ భవనాలు రాజధాని వైభవానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. దేశభక్తి భావాన్ని చాటుతూ.. జాతీయ పర్వదినానికి ఘన స్వాగతం పలుకుతున్నాయి.



## దుర్గి ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం




**దుర్గి.ఆగస్టు 14రాజధాని వాయిస్ :**స్థానిక పి.ఎం.శ్రీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ జంతుశాస్త్రం (పీజీటీ జువాలజీ) పోస్టును 2026--27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ షేక్.ఎమ్.రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విభాగంలో ఎం.ఎస్సీ, బిఈడి విద్యార్హతలు కలిగి, ఉండాలని తెలిపారు. నెలకు 12,000/- వేతనంతో పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలతో పాటు రెండు జతల నకలు (జిరాక్స్) ప్రతులతో ఈ నెల 17వ తేదీ ఉదయం 10:00 గంటలకు దుర్గి పి.ఎం.శ్రీ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

## దేశభక్తి నినాదాలతో హోరెత్తిన చీరాల

**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో త్రివర్ణ బైక్ ర్యాలీ**



**చీరాల ఆగస్టు14 రాజధాని వాయిస్ : :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ త్రివర్ణ బైక్ ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. చీరాల నల్లగాంధీ బొమ్మ నుంచి ప్రారంభమైన ర్యాలీ ముంతవారి సెంటర్, గర్ల్స్ హైస్కూల్, ఎంజీసీ మార్కెట్, బస్టాండ్ మీదుగా గడియార స్తంభం వరకు సాగింది. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్వయంగా ర్యాలీలో పాల్గొని నాయకులు, కార్యకర్తలు, యువతలో ఉత్సాహం నింపారు. త్రివర్ణ పతాకాలతో భారీగా తరలివచ్చిన ప్రజలు దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయ భావం, దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంపొందించాలనే లక్ష్యంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. "దేశభక్తి, ఐక్యత, అభివృద్ధి -- మనందరి బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు మువ్వల వెంకటరమణ, ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్ధన్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహాశివుని విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



**పెదకాకాని ఆగస్టు14 రాజధాని వాయిస్ ::-**దేవస్థాన ఉత్తర దిక్కు భాగము చెరువు కట్ట సిమెంట్ రోడ్డు (పల్లాలమ్మ గుడి వెనుక) నందు గుంటూరు విద్యానగర్ వాస్తవ్యులు చెరుకూరి కళ్యాణ్ రామ్, తేజస్వి దంపతుల సహకారంతో మహాశివుని విగ్రహము ఏర్పాటుకు శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు.కార్యక్రమములో పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, సభ్యులు కొమ్మూరి మల్లికార్జునరావు, బైరపనేని ధనలక్ష్మి, ధూపాటి శివశంకరరావు, వుల్లం రాజేశ్వరి, బండారు మల్లేశ్వరి, వరికూటి వీర సుధాకరరావు, ఎక్స్ అఫీషియల్ సభ్యులు పేటేటి ధనమ హేశ్వర ప్రసాద్ దాతలు పాల్గొన్నట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు.

# న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బేసిక్ స్కిల్స్ ఇన్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్

**మాచర్ల.ఆగస్టు 14 రాజధాని వాయిస్ :**బీ.టెక్ విద్యార్థులకు ఇంజినీరింగ్లో ప్రాథమిక నైపుణ్యాలు అనే అంశంపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహణమాచర్ల మండలం అలుగురాజుపల్లి లోని న్యూటన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ.టెక్ విద్యార్థుల కోసం ఇంజినీరింగ్లో ప్రాథమిక నైపుణ్యాలు అనే అంశంపై ఒకరోజు వర్క్ షాపు నిర్వహించారు.కాకినాడకు చెందిన వర్మాపుక్ జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ డా. కె.వి.ఎస్.జి. మురళీ కృష్ణ రిసోర్స్ పర్సన్ గా హాజరై విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యలో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార విదానాలు, వత్తిడి నిర్వహణ మరియు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా.మురళీకృష్ణ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, బృందపని వంటి నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రాథమిక ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఎంతో కీలకమని




తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ జున్నా చక్రధర్ రెడ్డి, ప్రిన్సిపాల్, యస్. నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్, బి. నరసింహారావు,ఏ.ఓ. ఖాసిం తదితరులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు, బీ.టెక్ విద్యార్థులు వర్క్ షాప్ లో ఉత్సాహంగా పాల్గొని నిపుణుల సూచనలు, సలహాలను స్వీకరించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి వర్క్ షాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మొక్కలు నాటిన న్యాయమూర్తులు

**మాచర్ల. ఆగస్టు14 రాజధాని వాయిస్ :**హర్ ఘర్ తిరంగు కార్యక్రమంలో భాగంగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ మరియు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ మరియు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి మొక్కలు నాటారు. మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ వారి ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవా కమిటీ వారి యొక్క ఆదేశాల మేరకు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు మొక్కలను నాటినట్లు మాచర్ల మండల న్యాయశాఖ కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దలు మాచర్ల జూనియర్ శ్రీనివాస్ కళ్యాణ్ మరియు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ హాజరై ముందుగా లాయర్లతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలను నాటి ట్రీ గాడ్స్ అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్ లోకదాలత్ సభ్యులు మరియు సీనియర్ న్యాయవాది గౌస్ బాష, శ్రీనివాస్ రెడ్డి



ఇంకా అనేక మంది లాయర్స్, ఆఫీస్ సిబ్బంది, శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు పి.హరిబాబు, ఎం. పాపి రెడ్డి, మెట్టు రఘురామిరెడ్డి, వై.నాగ శంకర్ రెడ్డి, సత్యనారాయణ రాజు, సంగీత ఉపాధ్యాయులు షేక్ చిన లాల్ సాహెబ్, రాజారావు, సుందరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో మెగా ప్లానిటేషన్ డే

**సత్తెనపల్లి.ఆగస్టు 14,రాజధానిలో వాయిస్ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో సత్తెనపల్లి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ,మెగా ప్లానిటేషన్ డే నిర్వహించారు.ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్ల పాల్గొన్నారు. అటవీ శాఖ అధికారి ఏర్పాటు చేసిన మెగా ప్లాంటేషన్ డే కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2018లో జేసిగా పని చేసేటప్పుడు సత్తెనపల్లి, ఎడ్లపాడు కేంద్రీయ విద్యాలయాల ప్రాంగణం ఏర్పాటు భాగస్వామినై ఉన్నానని తెలిపారు. ఇప్పుడు మాచర్ల, నరసరావుపేట పట్టణాలలో కూడా కేంద్రీయ విద్యాలయాలకు స్థలం కేటాయింపును బాధ్యతగా వహించుచున్నానని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు.విధ్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కష్టపడి పనిచేయడం, నైతిక విలువలను పాటించడం,ఐక్యతను పెంపొందించడం, సామాజిక సేవలో భాగస్వాములు కావడం చదువులో నైపుణ్యం వంటి అంశాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని,దేశ సార్వభౌమత్వం,




సమగ్రతను కాపాడేందుకు అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.మెగా ప్లాంటేషన్ డే ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దాని ఎదుగుదల మరియు సంరక్షణను పాఠశాలలో ఉన్నంతవరకు తనదే బాధ్యతగా వహించాలని అన్నారు.మొక్కలు పెంపునకు పర్యావరణం లో ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి,ఆర్డిఓ, తహశీల్దార్, విద్యాశాఖ,అటవీ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, మన పునాది తెలుగే

**భాషే బంధానికి మూలం**

**మాగులూరి భానుప్రకాష్ (యూఎస్ఏ)**

**వాషింగ్టన్ డిసి.ఆగస్టు 14,రాజధాని వాయిస్:** పుట్టి పెరిగిన గ్రామం, తల్లిదండ్రులు, మిత్రులు, అనుభవాలు, అనుబంధాలను వదిలి ఉపాధి కోసం దేశ, విదేశాలలో ఉంటున్న మనందరినీ కలిపివుంచే ఆస్తి, అస్తిత్వం మన మాతృబాష తెలుగు. సుదూర తీరాలలో ప్రవాస తెలుగు సంఘాల వేదికపై వేలాది మంది కలుసుకోవటం గొప్ప సహానుభూతి.ఇటీవల అమెరికా దేశ రాజధానిలో జరిగిన ఆటా 19 వ ప్రపంచ మహాసభలలో తెలుగు సాహిత్య వేదికపై అతిధిగా పాల్గొనటం గొప్ప అనుభవం. వృత్తి,ఉపాధి, వ్యాపార రీత్యా అమెరికాకి వచ్చిన లక్షలాది భారతీయులు ముఖ్యంగా తెలుగు వారు ఈ తరం తమ పిల్లలకు మాతృబాష తెలుగు నేర్పించటం చాలా బాధ్యతతో కూడిన విధిగా భావిద్దాం.భాషే బంధానికి మూలంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని, మనదైన ఘన చరిత్రను ఈతరం పిల్లలకు, భావి భారత పౌరులకు అందించటంలో, బంధాలను నిలబెట్టుకోవడంలో తెలుగు భాష పునాదిగా విద్య, ఉపాధి కోసం ఏ భాష నేర్చుకున్నా, ఎన్ని భాషలు అధ్యయనం, అభ్యాసం చేసినా మన అమ్మ భాష తెలుగును గౌరవిస్తూ, పరిరక్షించుకుంటూ, మనదైన సాహిత్యం, చరిత్ర, సంప్రదాయం, ఉన్నత విలువలతో కూడిన సంఘజీవన ఔన్నత్యాన్ని మన పిల్లలకు నేర్పిద్దాం.భాష అంటే కేవలం అక్షరాలూ,మాటలు కాదు, శతాబ్దాలుగా మనిషి పురోగతిని, జీవితకాల అనుభవాన్ని ముందు తరాలకు అందించే బ్రతికించే సంజీవని.



## కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

**వెల్దుర్తి.ఆగస్టు 14రాజధాని వాయిస్ :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్కడున్న మౌలిక వసతులు, భోజనశాల, తాగునీరు, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. బోధనాపరమైన ఇబ్బందులను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయుల కొరతను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని
ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్తు హైస్కూల్ నందు నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల నిర్మాణాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను సమీక్షించారు. ఆయన వెంట కూటమి పార్టీల నాయకులు ఉన్నారు.

## వివిఐటి, వివిఐటియు విద్యార్థుల హర్ ఘర్ తిరంగా



**పెదకాకాని ఆగస్టు14 రాజధాని వాయిస్ ::-** మండల పరిధిలోని నంబూరు శివారులో ఉన్న వివిఐటియులో 80వ ,దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. 80 మీటర్ల పొడవైన భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు విశ్వవిద్యాలయం నుండి నంబూ రు గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వివిఐటి ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపిప్రారంభించారు. విద్యార్థులు నంబూరు గ్రామంలో "భారత్ మాతాకీ జై" అంటూ చేసిన నినాదాలతో గ్రామంలో దేశభక్తి భావన మారుమోగింది. వివా, వివిఐటి ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు క్రీడామైదానంలో దేశప టం ఆకారంలో నిలబడి ప్రదర్శించారు. విద్యార్థులలో దేశభక్తిని, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడంలో ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు దోహదపడతాయని వివిఐటియు ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. కార్యక్రమంలో వివిఐటియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, వివిఐ ప్రిన్సిపాల్ చదవాల సరళ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. అరుణ్ కుమార్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రావణ మాస కోటి కుంకుమార్చనలు ప్రారంభం



**గుంటూరు ఆగస్టు14 రాజధాని వాయిస్ :** స్థానిక అరండల్ పేట శ్రీ అష్టలక్ష్మి సవేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రావణ మాస 31వ కోటి కుంకుమపూజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తొలుత గోపూజ, విఘ్నేశ్వర ఆరాధన శ్రీ చక్రమహామేరుకు విశేష అభిషేకాలు,అర్చనలు, మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు,విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. వేద పండితుల నిర్వాహణలో సువాసినులచే సామూహిక కోటి కుంకుమార్చన నిర్వహించారు.పూజలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## రెంటాల గ్రామం వైసీపీ నేత నవ్వులూరి చెన్నారెడ్డి హత్య కేసులో నిందితుల అరెస్టు




**గురజాల, ఆగస్టు14 రాజధాని వాయిస్ :** గురజాల పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డిఎస్పీ మల్ల మహేశ్వరరావు మాట్లాడుతూ హత్య కేసులో ప్రధాన నిందితులైన నవ్వులూరి అశోక రెడ్డి, జక్కి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, మద్దిగపు పేరెడ్డి సహా మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన తెలియ జేశారు. ఈ హత్యకు సహకరించిన ప్రతి ఒక్కరిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలియజేశారు. అలాగే గ్రామాల్లో ఫ్యాక్షన్ నిర్మూలనకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కారంపూడి సీఐ ఆవుల భాస్కరరావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధ యాచకుడు మృతి



**ఆగస్టు14 రాజధాని వాయిస్ :**బాపట్ల జిల్లా కర్లపాలెం బాపట్ల ఏరియా ఆసు పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధ యాచకుడు మృతి చెందారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల ఈ వ్యక్తి చాలా ఏళుగా కర్లపాలెం--బాపట్ల మధ్య యాచకుడిగా జీవిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 9న నల్లమోతువారిపాలెం సమీపంలోని జాతీయ రహదారి--216 పక్కన చెట్టు కింద అనారోగ్యంతో పడి ఉండగా, స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ ద్వారా బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 11న మృతి చెందారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతని రక్తసంబంధీకులు ఎవరైనా ఉంటే వెంటనే కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర విజ్ఞప్తి చేశారు.సంప్రదించాల్సిన నంబర్: కర్లపాలెం ఎస్ఐ -- 9440900870 కర్లపాలెం పోలీస్ స్టేషన్

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com